

ఎయిర్ అంబులెన్స్ ద్వారా తరలిస్తున్న దృశ్యం

7 ఎయిర్ అంబులెన్స్‌లో బెంగళూరుకు కురుబూరు శాంతకుమార్

వేర్వేరు ప్రమాదాల్లో

నలుగురి దుర్మరణం

- కృష్ణా నదిలో టిప్పర్ బోల్తా పడి ఇద్దరు..
- బస్సును బైక్ ఢీకొని మరో ఇద్దరు..



బోల్తా పడిన టిప్పర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. విజయపుర-హుబ్బళ్లి జాతీయ రహదారిపై కొల్హార వంతెనపై నుంచి కృష్ణానది లోయలోకి టిప్పర్ బోల్తా పడి ఇద్దరు మృతి చెందారు. శనివారం సాయంత్రం బసవ నబాగేబడి తాలూకాలోని యల్వార గ్రామానికి చెందిన డ్రైవర్ సచిన్(32),క్లీనర్ పరశురామ (30) అక్కడికక్కడే మృతి చెందారు. వేగంగా వస్తున్న టిప్పర్ డ్రైవర్ అదుపు తప్పి వంతెన గోడను ఢీ కొనడంతో వంతెనపై నుంచి టిప్పర్ నదిలో పడిపోయింది. నదిలో నీరు లేకపోవడంతో ఇసుకలో టిప్పర్ బోల్తా పడింది. వీరిద్దరు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే కన్నుమూశారు. కొల్హారా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఓవర్ టేక్ చేయబోయి..



బస్సును ఢీకొన్న బైక్

గంగావతి రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కారటగి దగ్గర బైక్‌పై వెళ్తున్న ఇద్దరు కారును ఓవర్‌టేక్ చేయబోయి దుర్మరణం చెందారు. మానవి తాలూకా నుంచి హొస్పేటకు వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న యువకులు ఎదురుగా వస్తున్న జీపును తప్పించబోయి బస్సును ఢీ కొన్నారు. రోడ్డుపై పడ్డ ఇద్దరు యువకులు మంజునాథ్(32), కాశీం సాబు(28) అక్కడికక్కడే మరణించారు. వీరిద్దరూ సిద్దాపురగ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు.



కాశీంసాబు (ఫైల్), మంజునాథ్(ఫైల్)

వైద్యుడిపై కేసు నమోదు

- డాక్టర్ నిర్లక్ష్యంతోనే భర్త మృతి చెందాడని ఫిర్యాదు
- రాయచూరు ఒపెక్ ఆస్పత్రిలో ఘటన



ఒపెక్ ఆస్పత్రి

రాయచూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వైద్యుడి నిర్లక్ష్యంతోనే రోగి మృతి చెందారన్న ఫిర్యాదుతో డాక్టర్‌పై కేసు నమోదు చేశారు. బాధతో వచ్చిన రోగికి సరైన చికిత్స అందించక చావుకు కారణమయ్యాడన్న ఆరోపణ మేరకు నగరంలోని ఒపెక్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ప్రదీప్ కులకర్ణిపై రాయచూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మాన్వి తాలూకా కంబళనెత్తి గ్రామానికి చెందిన విరుపాక్షప్ప(49)కు కిడ్నీలో నొప్పిరాగా ఒపెక్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు డాక్టర్ ప్రదీప్ కులకర్ణి వైద్య పరీక్ష నిర్వహించి చికిత్సనందించాడు. మూడురోజుల అనంతరం డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన అతడు శ్వాసకోశ బాధతో తిరిగి ఆస్పత్రిలో చేరారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అక్కడి వైద్యులు రెండు కిడ్నీలో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు తెలిపారు. అంతకుపూర్వం వైద్యమందించిన డాక్టర్ ప్రదీప్ కులకర్ణి లేకపోవడంతో వారు మరో చోటికి వెళ్లాల్సిందిగా సూచించారు. దీంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్సనందిస్తుండగా బాధితుడు మృత్యువాతపడ్డాడు. అయితే వైద్యుడు నిర్లక్ష్యంగా చికిత్స చేయడం వల్లే తన భర్త చనిపోయాడంటు భార్య పోలీసులకు పిర్యాదు చేశారు. ఒపెక్ ఆస్పత్రికి చెందిన ముగ్గురు నిపుణులైన వైద్యులతో విచారణ జరిపించి డాక్టర్ పై చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.



దత్తతకు శిశువులు.. కరువు..!



- దరఖాస్తు చేసుకున్నది 4093 మంది..
- అందుబాటులో 39మందే..

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో ఉన్నత విద్య, ఉద్యోగాల ద్వారా స్థిరపడాలని భావించేవారు పెరుగుతున్నారు. ఇలా అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకుని పెళ్లి చేసుకున్నా సంతానం కలగడం సమస్యగా మారుతోంది. ఇక ఐవీఎఫ్‌లాంటి అత్యాధునిక సౌలభ్యాల సంతానసాఫల్య కేంద్రాలు మహానగరాల నుంచి సాధారణ పట్టణాల దాకా పెరిగిపోతున్నాయి. ఏటా ఐవీఎఫ్ కేంద్రాలు లక్ష్యాలను మించి సంతానసాఫల్యాలు సాధ్యం చేస్తున్నట్లు నివేదికలు పేర్కొంటున్నారు. స్థిర నివాసం, ఆదాయంతోపాటు అన్ని సౌకర్యాలు ఉన్నా పిల్లలు లేనివారు దత్తత పొందేందుకు ఉత్సాహం చూపుతున్నారు. గడిచిన మూడు దశాబ్దాల కింద అనాథ పిల్లలంటే అడిగేవారు లేకపోయారు. కానీ ప్రస్తుతం అనాథ శిశువులకోసం వేయి కళ్లతో ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

రాష్ట్రవ్యాప్తంగా 45 ప్రభుత్వ, ప్రైవేట్ దత్తత సంస్థలు ఉన్నాయి. శిశువులను దత్తత పొందేందుకు చట్టపరంగా ఎన్నో ప్రక్రియలు ఉన్నాయి. అంతటికీ సిద్ధమై దరఖాస్తు చేసుకునేవారు పెరుగుతున్నారు. శిశుసంరక్షణ డైరెక్టరేట్‌లో 4,093 మంది శిశువులకోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే రాష్ట్రంలో అందుబాటులో ఉండేది కేవలం 39మంది ఆరోగ్యవంతమైన పిల్లలు కాగా, 56మంది దివ్యాంగ చిన్నారులు అందుబాటులో ఉన్నారు.

పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియ

దత్తత ప్రక్రియ సంపూర్ణంగా ఆన్‌లైన్ ఆధారంగా పనిచేస్తోంది. దత్తత పొందాల్సిన దంపతులు, పిల్లలకోసం కేరింగ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పిల్లలు అందుబాటులో ఉన్నప్పుడు దంపతుల ప్రాధాన్యతా పరంగా వారికి అందజేస్తారు. రాష్ట్రంలో 21 ప్రభుత్వ ప్రత్యేక దత్తత సంస్థలు, 24 ప్రైవేట్ దత్తత సంస్థలు ఉన్నాయి.

దరఖాస్తుల వెల్లువ..

ఏటా రాష్ట్రవ్యాప్తంగా 200మంది శిశువులు లభిస్తారు. అయితే దరఖాస్తులు 1500 దాకా వస్తుంటాయి. ఒక్కో ఏడాది అంతకంటే తక్కువ, ఎక్కువగాను అర్జీలు వస్తాయి. శిశువుల దత్తత విధానంలో మహారాష్ట్ర తొలిస్థానంలో ఉండగా కర్ణాటక నాల్గోస్థానంలో ఉంది. రాష్ట్రంలో 2020-25 వరకు 1265మంది శిశువులను దత్తత ఇచ్చారు. వీరిలో 1132మంది స్వదేశీయులు దత్తత పొందగా 133మంది వివిధ దేశాలకు చెందిన వారు ఉన్నారు. శిశు సంరక్షణా డైరెక్టరేట్‌కు చెందిన డిప్యూటీ డైరెక్టర్ టీఎస్ అరుంధతి అభిప్రాయం ప్రకారం శిశువులు వద్దనుకునేవారు రోడ్లపక్కన, కంపచెట్లలో పడేయరాదన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ శిశువుల సంరక్షణా డైరెక్టరేట్ కార్యాలయాలు ఉన్నాయి. వారికి అప్పగిస్తే చిన్నారులను పెంచి పోషించి ఒకస్థాయికి తీసుకొస్తామన్నారు. పిల్లలు కావాలని ఆసక్తితో ఉండేవారికి చట్టబద్ధంగా అప్పగిస్తామన్నారు. చిన్నారులను వద్దనుకుని పడేస్తే వారి ప్రాణాలు తీసినట్లు అవుతుందని అంతటి చర్యలకు పాల్పడరాదన్నారు.



కేరింగ్ వెబ్‌సైట్

ఆరేళ్లలోపు చిన్నారులకు డిమాండ్

దత్తత కోరేవాళ్లలో ఆరేళ్లలోపు చిన్నారులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. 2-6 ఏళ్లలోపు చిన్నారులను దత్తత తీసుకుంటే పూర్తిగా వారికి అవగాహన కల్పించి సొంత బిడ్డల్లా మార్చుకోవచ్చునని దంపతులు భావిస్తున్నారు. అంతకంటే ఎక్కువ వయస్సు కల్గిన పిల్లలైతే భవిష్యత్తులో సమస్యలు వస్తాయని, అప్పటివరకు బాల్యంలో ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నారో అవి వారి మనసుపై ప్రభావం చూపుతాయని వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా 8-18ఏళ్ల వయసుదాకా కూడా దత్తత పొందేందుకు అవకాశం ఉంది. ఇలా రాష్ట్రంలో 19వేలమంది ఉన్నారు. వీరిలో 51శాతం బాలురు, 49శాతం బాలికలు ఉన్నారు. కానీ వీరంతా అనాథాశ్రమాలతోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు, కేంద్రాల్లో చదువు కొనసాగిస్తున్నారు. వీరిని దత్తత ఇచ్చేందుకు అవ్వ, తాతలతోపాటు దూరపు బంధువులు అంగీకరించడం లేదు. తల్లిదండ్రులు వివిధ కారణాలతో విడిపోయి చిన్నారులు సంరక్షణా కేంద్రాలలో పెరుగుతున్నవారు ఉన్నారు. అలాంటివారిని దత్తత తీసుకుంటే భవిష్యత్తులో తల్లిదండ్రులు ఒక్కటైనా లేదా వేర్వేరుగా తమ బిడ్డ కావాలని అభ్యంతరం తెలిపితే సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, పైగా కొంతకాలం ప్రేమ, అభిమానం చూపి ఒక్కసారిగా వదులుకోవడం సా. ధ్యం కాదని వెనుకడుగు వేస్తున్నారు. అందరిలోనూ మార్పు వస్తేనే శిశువు బతకడం సాధ్యమన్నారు.



బెంగళూరు రోడ్లకు మహర్దశ..!

- అంతర్జాతీయ నాణ్యతతో రహదారుల నిర్మాణం
- రూ.1700 కోట్లతో అభివృద్ధి పనులు
- పరిశీలించిన డీసీఎం డీకే



ఆర్‌టీ నగర్‌లో పర్యటిస్తున్న డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): బ్రాండ్ బెంగళూరులో భాగంగా నగరంలో అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు ఉండేలా వైట్‌ట్యాపింగ్ రోడ్లను నిర్మిస్తున్నట్లు డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. కనీసం 30ఏళ్లపాటు దీర్ఘకాలిక మన్నిక వచ్చేలా రోడ్లు నిర్మిస్తున్నామని ఇందుకోసం రూ.1700 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. బెంగళూరు నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న వైట్‌ట్యాపింగ్ పనులను బెంగళూరు నగరాభివృద్ధి శాఖ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌టీ నగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన 14 ప్యాకేజీల ద్వారా 150 కిలోమీటర్ల పొడవుతో 97 రోడ్లలో వైట్‌ట్యాపింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఇకపై జలమండలితోపాటు కేబుల్ వైర్లకోసం రోడ్లను ఇష్టం వచ్చినట్లు తవ్వేందుకు వీలు లేదన్నారు. సొరంగమార్గం సరికాదని కేంద్ర రైల్వేమంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ బెంగళూరులో సరికాదంటే మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం ఎందుకు నిర్మించిందని ప్రశ్నించారు. పరిశీలన వేళ మంత్రి కృష్ణబైరేగౌడ, మంత్రి భైరతి సురేశ్ తదితరులు పాల్గొన్నారు. నెట్టికల్లప్ప సర్కిల్, జాలహళ్ళి టీవీఎస్ క్రాస్, మహాలక్ష్మి లే అవుట్ తదితర ప్రాంతాల్లో డీసీఎం పర్యటించారు.



రహదారుల నాణ్యతను పరిశీలిస్తూ..

కాంగ్రెస్ గూటికి మాజీ ఎంపీ




శివరామేగౌడను పార్టీజెండాతో స్వాగతిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీలో ఎంపీగా వ్యవహరించి ఆ తర్వాత కాంగ్రెస్, బీజేపీలలో కొనసాగి ఇటీవల ఏడాదిన్నర కాలంగా స్తబ్ధుగా ఉన్న ఎల్ఆర్ శివరామేగౌడ కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం కేపీసీసీలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ శివరామేగౌడ, ఆయన కుమారుడు మంజేగౌడ, ఆప్ పార్టీ కీలక నేత బ్రిజేశ్ కాళప్ప, ఎల్ఎస్ చేతన్‌లు కాంగ్రెస్‌లో చేరారు. 2023లో బీజేపీలోకి చేరిన శివరామేగౌడ ఎన్నికల తర్వాత మౌనంగా ఉన్నారు. కానీ ఇటీవల ఏడాదికాలంగా కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు సన్నిహితంగా వ్యవహరిస్తూ వచ్చారు. తాజాగా పార్టీలో చేరారు. ఇక కాంగ్రెస్ నుంచి దూరమై ఆప్‌లో చేరిన బ్రిజేశ్ కాళప్ప కూడా మరోసారి సొంతగూటికి చేరుకున్నారు.

నకిలీ ఈడీ అధికారుల కేసులో...

కేరళ ఏఎస్ఐ అరెస్టు



ఏఎస్ఐ షహీర్‌బాబు

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈడీ అధికారుల ముసుగులో బీడీ కంపెనీ యజమానిని దోపిడీకి పాల్పడిన కేసుకు సంబంధించి కేరళ రాష్ట్రానికి చెందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ షహీర్‌బాబును విట్ల పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఇటీవల దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకా విట్ల పరిధిలోని బోళంతూరు నార్ష్‌సులైమాన్ హాజి ఇంటికి వెళ్లి ఈడీ అధికారులంటూ పరిచయం చేసుకుని దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఈకేసులో నలుగురిని విట్ల పోలీసులు అరెస్టు చేశారు. కేరళ రాష్ట్రం త్రిచూర్ కొడంగల్లూరు పోలీస్‌స్టేషన్ ఏఎస్సై షహీర్‌బాబు (49)ను అరెస్టు చేసి తీసుకొచ్చారు. ఇతడితోపాటు ఇక్బాల్ పర్లి బంట్వాళ (38), సిరాజుద్దీన్ నార్ష (37), అన్సార్‌బజల్ (28)లు అరెస్టు అయినవారు. కేరళలోని కొడంగల్లూరు ఏఎస్సై షహీర్‌బాబు నకిలీ ఈడీ బృందాన్ని ఏర్పాటు చేసుకుని ఇటువంటి దోపిడీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. జనవరి మూడోవారంలో సింగారి బీడీ కంపెనీ యజమాని సులైమాన్ ఇంటికి వెళ్లి అక్రమంగా కోట్లాది రూపాయలు లావాదేవీలు చేస్తున్నారని, పన్నులు చెల్లించలేదంటూ బెదిరించారు. ఈడీ అధికారులుగా పరిచయం చేసుకోవడంతో సులైమాన్‌తోపాటు కుటుంబీకులు భయపడ్డారు. అనంతరం 30 లక్షల రూపాయల నగదు దోపిడీ చేసి పరారీ అయ్యారు. ఆ తర్వాత ఆరా తీస్తే వారు నకిలీ అధికారులుగా తేలడంతో విట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు భిన్నమైన కోణాలలో విచారణ జరపగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే కేరళ రాష్ట్రం కొట్టాయం నివాసి అనిల్ ఫెర్నాండెజ్, సచిన్, షబీన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం మరో నలుగురు పట్టుబడ్డారు. మరింతమంది నిందితులకోసం గాలింపు చేపట్టినట్లు విట్ల పోలీసులు తెలిపారు.

వలస జీవులు..!

- ఊరు వదిలితేనే కడుపు నిండేది
- పశువులకైనా, మనుషులకైనా...




కొప్పళ జిల్లా నుంచి మేత కోసం తరలి వెళ్తున్న పశువులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కడుపు నిండాలంటే.. ఊరు కదలాల్సిందే.. అది పశువులైనా, మనుషులైనా తప్పదు మరి. మడినాడుగా, సస్యశ్యామల ప్రాంతంగా పేరున్నా బళ్లారి జిల్లాలోనే కొన్ని కరువు ప్రాంతాల్లో గ్రాసం దొరకక పశువులు నిత్యం వలస బాట పడుతుంటాయి. ఇవ వేసి ప్రారంభం అయ్యిందంటే గ్రామాల్లో గడ్డి కొరత తీవ్రంగా ఉంటుంది. డబ్బులున్న బడా రైతులు రూ.లక్షలు పోసి గడ్డిని కొని తెచ్చుకుంటారు. కానీ చోటా పాడి రైతులు మాత్రం తమ జీవాల కడుపు నింపడానికి వలస బాట తప్పదంటున్నారు. బళ్లారిరూరల్ పరిధిలోని పీడీ హళ్లి, చాగనూరు, హగరి తదితర ప్రాంతాల్లో వరి కోతలతో పాటు అధికంగా గ్రాసం లభిస్తుండటంతో కొప్పళ జిల్లా నుంచి పశువులను మేత కోసం దాదాపు 135 కిలోమీటర్ల దూరంగా ఉన్న బళ్లారి జిల్లా ప్రాంతానికి తరలివస్తున్నాయి. పశువుల మేతకు ఇక్కడ వేదవతి నది క్రింద పచ్చదనం నిండుకుని పశువులకు మేత లభిస్తుండటంతో కాపరులు కొప్పళ జిల్లా వాసులు ఇక్కడికి తరలిస్తున్నారు. రెండు నెలల పాటు పొలాల్లోనే పశువులతో కలసి వుండి జీవనోపాధి చేస్తూ తమ జిల్లాలకు వెళుతున్నట్లు పశువుల కాపరులు తెలిపారు. కరువుకు నిలయమైన కొప్పళ జిల్లాలో గ్రాసం దొరకడం కష్టంగా ఉందని, ఏటా తమకు వలస తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలిచ్చినా, ఇవ్వకపోయినా తాము ప్రేమగా పెంచుకున్న పశువుల కడుపు నింపడానికి సుదీర్ఘ ప్రయాణం తప్పదంటున్నారు. ప్రేమగా పెంచుకున్న తమ పశువుల ఆకలి తీర్చడానికి ఎంత దూరమైనా వెళ్తామన్నారు. ప్రభుత్వాలు తమ కష్టాలు పరిశీలించి తక్కువ ధరకు గ్రాసం అందించేలా చూడాలని కోరారు. బతకాలంటే వలస తప్పని తమ జీవితాలు ఎప్పుడు మారుతాయోనని మనుషులు, పశువులు ఎదురు చూడక తప్పేలా లేదు.



ట్రాక్టర్లపై వలస వెళ్తున్న కనిగిరి వాసులు

కంప్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే గ్రామాల్లో పనులు లేక ప్రజలు వలసబాట పడుతున్నారు. ఖరీఫ్ సమయంలో కొంతవరకు వర్షాలు కురవడంతో అక్కడా, ఇక్కడ కూలీ పనులు దొరికాయి. అయితే వేసవిలో ఆయకట్టు ప్రాంతాల్లో మాత్రమే పని దొరుకుతుందని, మిగతా ప్రాంతాల్లో వలస తప్పదని వలస జీవులు వాపోతున్నారు. పంటలు పండించుకుని వేసవి సమయాల్లో తమ పొలాల్లో పనులు లేక ఇళ్లల్లో గడిచేందుకు ఇబ్బందికరంగా మారడంతో వేరే ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. కొప్పళ జిల్లా గంగావతి, కారటగి, ప్రాంతాల్లో పనులు లేక, పొట్ట గడవక బళ్లారి జిల్లాలోని కురుగోడు, కంప్లి, కుడితిని, ఎర్రంగళి, మారుతి క్యాంపు ప్రాంతాల్లోకి మిరప పంట కోసేందుకు రైతులు తరలివస్తున్నారు. ఈ సందర్భంగా రామలింగప్ప మాట్లాడుతూ ఏటా తమ ప్రాంతాల్లో పనులు నవంబరు, డిసెంబరుకే పనులు పూర్తవుతాయన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పొలంలో పనులు చేపట్టుకుని పరిశుభ్రం చేసుకుని తదనంతరం తాము ఈ పొరుగు జిల్లాల్లోకి వెళ్లి కూలీ పనులు చేసుకుని తమ జీవనం కొనసాగిస్తామన్నారు. ఇది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ ఈ మూడు నెలలు ఇక్కడే కూలీపనులు చేసుకుంటామని, అనంతరం తిరిగి తమ గ్రామాలకు వెళ్లి ఖరీఫ్ పంటలకు తమ పొలాల్లో సేద్యం ప్రారంభిస్తామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఊళ్లు వదలక తప్పడం లేదన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1612.65	1,587.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,951	142
నీటి నిల్వ (టీఎంసీలు)	43.07	9.36

మూర్ఛవ్యాధిపై అపోహలు వద్దు

● సరైన సమయంలో గుర్తిస్తే నివారణ సాధ్యం : అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిప్రసాద్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధిపై అపోహలు వీడాలని, అజ్ఞానం నుంచి సామాన్యులు బయటకు రావాలని అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిప్రసాద్ సూచించారు. శనివారం విజయనగరం జిల్లా హొసపేట ప్రభుత్వ ఆసుపత్రిలో నగర జిల్లాయంత్రాంగం, జడ్పీ, కర్ణాటక బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, జిల్లా మానసిక ఆరోగ్య విభాగం, సమాచార , ప్రజా సంబంధాల శాఖ తాలూకా ఆరోగ్య అధికారి కార్యాలయం, రాఘవేంద్ర పారామెడికల్ కళాశాల సహకారంతో నిర్వహించిన అంతర్జాతీయ మూర్ఛ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనారోగ్యానికి అతీతంగా మూర్ఛ అవగాహనతో జీవితాలను శక్తివంతం చేయడం' అనే నినాదంతో ప్రపంచ మూర్ఛ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. మూర్ఛవ్యాధి గురించి సాధారణ ప్రజలు తెలుసుకోవాలన్నారు. సరైన మందులు తీసుకోవడం ద్వారా దీనిని నయం చేయవచ్చన్నారు. మూర్ఛవ్యాధి వచ్చినప్పుడు వీడియో తీస్తే వైద్యులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రోగి స్పృహ కోల్పోయినప్పుడు , వారిని లాక్ చేసిన స్థితిలో ఉంచరాదని, ఉల్లిపాయలు లేదా మురికి మూట్ల వాసన



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆరోగ్య అధికారులు

వచ్చేలా చేయరాదన్నారు. స్పృహ కోల్పోయిన సందర్భంలో రోగికి ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. డాక్టర్ ఇచ్చిన సలహాను పాటించాలని, మూర్ఛ సమయంలో నోటిలోని ఏదైన ద్రవం బయటకు పోయేలా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఆవ్యక్తి తల కింద ఏదో ఒక రకమైన మెత్తటి వస్త్రాన్నిఉంచాలన్నారు. ఆ వ్యక్తి నోటిలో ఏమీ పెట్టకుండా, వైద్యుడు వచ్చే వరకు అక్కడే ఉండాలన్నారు. ఆ వ్యక్తికి విశ్రాంతి లేదా నిద్రించడానికి అనుమతి ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ భరత్ పలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ రాధిక, డాక్టర్ ఆశాకోరి,డాక్టర్ రాఘవేంద్రతో పాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీ తుకారాం

తోరణగల్లు, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): సండూరు తాలుకా పలు అభివృద్ధి పనులకు ఎంపీ తుకారాం భూమిపూజ చేశారు. ఏఉబెంచి గ్రామంలో శుద్ధనీటి పథకం, వేణి వీరాపురంలో కేకేఆర్‌డీబీ వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణానికి, సద్గురు మునితాత నూతన ఆలయ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కొత్తగా నిర్మించిన శుద్ధినీటి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలతో మౌలిక సౌకర్యాలపై చర్చించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ నందీష్

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐటీఐ మైదానంలో ఆదివారం ఉదయ అండ్ టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అప్పు క్రికెట్ పోటీలను నగర మేయర్ నందీష్ బాబు ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ ఆటలతోనే పిల్లలకు ఆరోగ్యం లభిస్తుందన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఆయన సూచించారు. డీసీసీ జనరల్ సెక్రటరీ నాగలకేరి గోవిందు, షమీం జెట్లీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నాపై నమ్మకం ఉంచండి: ఎంపీ

కంప్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): నాపై నమ్మకం ఉంచి పోరాటాన్ని విరమించుకోవాలని రైతులకు ఎంపీ తుకారాం భరోసా ఇచ్చారు. జిల్లాలోని కుడితిని పట్టణంలో 791 రోజులుగా పోరాటం చేస్తున్న రైతుల ధర్నా వద్దకు శనివారం ఎంపీ వచ్చారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణి, ఎస్ఎండీసీ, లక్ష్మి మిట్టల్ ఫ్యాక్టరీలకు భూములిచ్చి రైతులు కొన్నేళ్లుగా ఇబ్బందిపడుతు న్నారన్నారు. అప్పట్లో బీజేపీ ప్రభుత్వం రైతులను బెదిరించి ఫ్యాక్టరీలకు భూములు ఇచ్చేలా చేశారన్నారు. లక్ష్మి మిట్టల్ ఫ్యాక్టరీ ఆంధ్రలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన రెండు ఫ్యాక్టరీ ఎస్ఎండీసీ బ్రాహ్మణి ఇతర ఫ్యాక్టరీలు ఏర్పాటుకు సహాయం చేస్తానన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చించి న్యాయం చేకూరుస్తానని హామీ ఇచ్చారు. దీనిపై జంగ్లిసాబ్, తిప్పేస్వామి మాట్లాడుతూ గతంలోనే బెల్గామ్ శీతాకాల సమావేశాల్లో ఎమ్మెల్యే ఈ విషయంపై చర్చించినా ఇప్పటివరకు న్యాయం జరగలేదన్నారు. అలాగే మీరు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ, ఎంపీగా అయినా అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి సహకారం అందించలేదన్నారు. రైతులు 791 రోజులుగా నిరసనలు తెలుపు



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ

తున్నా తమ కష్టాలు ఏ నాయకుడు పట్టించుకోలేదన్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అరిగిణదోణి, జానేకుంటి, కొళగల్, ఎర్రంగళి, సిద్దమ్మనళ్లి, కుడితిని, వేణి వీరాపురం గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రామగిరి/చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండల సరిహద్దు జాతీయరహదారిపై ఆదివారం సాయంత్రం ఓ కారు బోల్తా పడిన ఘటనలో ఒకరు గాయపడ్డారు. బెంగళూరుకు చెందిన మైకెల్ ఫెర్నాండేజ్ మరొకరితో కలిసి అనంతపురం నుంచి కారులో బెంగళూరుకు వెళ్తున్నారు. ఎస్ఎస్‌గేటు సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి పడింది. ప్రమాదంలో మైకెల్ ఫెర్నాండేజ్‌కు తీవ్రగాయాలు కాగా మరో వ్యక్తికి ఎలాంటి గాయాలుకాలేదు. గాయపడిన వ్యక్తిని ప్రైవేటు వాహనంలో అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు సీకేపల్లి ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముఖ్య అధికారిని బదిలీ చేయండి

కంప్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణ పంచాయతీ ముఖ్య అధికారి తీర్థ ప్రసాద్‌ను బదిలీ చేయాలని గ్రీన్ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కుడితినిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల్లో సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్య అధికారికి సమస్యను వివరిస్తే ఘర్షణకు దిగుతున్నారన్నారు. గత యేడాది గౌరీశంకర్ అనే వ్యక్తిపై ఘర్షణకు దిగిన విషయంపై జిల్లా అధికారులతో పాటు కుడితిని పట్టణంలో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. శనివారం కుడితినికి పట్టణ పంచాయతీకి వచ్చిన ఎంపీకి ముఖ్య అధికారి బదిలీ విషయాన్ని తెలియజేశామన్నారు. ఆదివారం ఉదయం అరిగిణదోణి బసవగౌడ కాలేజీ ముందుగా భాగంలో తమపై ఎందుకు ఎంపీ తుకారాంకు ఫిర్యాదు చేస్తారని ఘర్షణకు దిగారన్నారు. కావున ముఖ్య అధికారిని వెంటనే బదిలీచేసి మంచి అధికారిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, శివశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రీన్ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్



విద్యార్థులకు పోస్టల్ బాక్స్‌ను పరిచయం చేస్తున్న రవిచెళ్లగుర్కి

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ పోస్టల్ సర్వీస్ ప్రపంచంలోనే అతిపెద్ద కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను కలిగి ఉందని, దాని సేవలను సద్విని యోగం చేసుకోవాలని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. ఆదివారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులను వివిధ ప్రభుత్వ విభాగాలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం గ్రామాలతో నిండిన దేశమైనప్పటికీ, ప్రతి గ్రామంలో పోస్టల్ సేవా సౌకర్యాలుఉండటం ప్రత్యేకత అన్నారు. మెట్టమెదట సూయజ్ కాలువ ద్వారా ఇంగ్లాండ్, భారతదేశం మధ్య మెయిల్ రవాణా ప్రారంభమైందని, 1839లో భారతదేశంలో టెలిగ్రాఫ్ ప్రవేశపెట్టబడిందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 1,56000 పోస్టాఫీసులు పనిచేస్తున్నాయని, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఎన్నో సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. తరువాత జిల్లాకలెక్టర్ కార్యాలయం,ఏసీ కార్యాలయం, తాలూకా కార్యాలయం మొదలైన ప్రదేశాలను సందర్శించారు. ఆయా కార్యాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వంట వండిన పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు

కంప్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): కురుగోడు తాలుకా సిరిగేరి గ్రామ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు విద్యార్థులకు వంట వండారు. రెండు రోజులుగా మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలు తమ వేతనాలు పెంపు కోసం బెంగళూరులో నిరసన చేపడుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మల్లయ్య ముందుకొచ్చి వంట సహాయకురాలితో పాటు ఆయన విద్యార్థులకు అన్నం, సాంబార్ సిద్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షులుగా ఎన్నికైన పాఠశాలకు ఏ సమస్యగా వచ్చినా ముందుండి పరిష్కరించినప్పుడే గుర్తింపు ఉంటుందన్నారు. వేతనాలు పెంపుపై వంట చేసే మహిళలు ధర్నా చేసేందుకు వెళ్లారు. ఆ లోటు విద్యార్థులకు రాకుండా విద్యార్థులకు అన్నం వండేందుకు సిద్ధపడినట్లు తెలిపారు.



విద్యార్థులకు అన్నం సిద్ధం చేస్తున్న మల్లయ్య

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రాయచూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగర సమీపం పవర్ గ్రిడ్ కార్యాలయం ఎదురుగా శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నీరమాన్వి గ్రామానికి చెందిన యువకుడు మృత్యువాతపడ్డాడు. మాన్వి తాలూకా నీరమాన్వి గ్రామానికి చెందిన రాజశేఖర్(32) బైక్‌పై రాయచూరు వైపు వస్తుండగా పవర్ గ్రిడ్ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనుల వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌పై నుంచి పడిన రాజశేఖర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు వెస్ట్ పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేవదాసీలకు నివేశన స్థలాలు ఇవ్వాలి



ఎంపీ తుకారామ్‌కు సమస్యను వివరిస్తున్న దేవదాసి విమోచన సంఘం నాయకులు

తోరణగల్లు, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): చాలా కాలంగా కుడితిని పట్టణంలో తమ డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్న రైతు బాంధవులతో మాట్లాడటానికి వచ్చిన ఎంపీ తుకారాంకు దేవదాసి విమోచన మహిళా సంఘం పదాధికారులు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బళ్లారి తాలుకాలో 886 మంది, కురుగోడులో 527, కంప్లిలో 684, సిరుగుప్పలో 1084, సండూరు లో 1094 మంది దేవదాసీ మహిళలు ఉన్నారన్నారు.వారికి నివేశన స్థలా లు ఇచ్చి ఆదుకోవాలన్నారు. సంఘం పదాధికారులు ఈరమ్మ ఏ స్వామి, హెచ్ దుర్గమ్మ, యంకమ్మ, వీరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టించుకోరా..?

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని 15వ వార్డులో వడ్డరబండ రాజకాల్వకు కార్పొరేషన్ అధికారులు డ్రైనేజీ మరమ్మతుల కోసం గుంతను తవ్వారు. అయితే 10 రోజులు దాటినా ఇంతవరకు దానిని మూయకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడిరోడ్డుపై వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. నిఇకి తోడు విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలలకు ఈ మార్గం గుండానే వెళుతుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి డ్రైనేజీకి తీసిన గుంతను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



నడి రోడ్డుపై గుంతను తీసి వదిలేసిన దృశ్యం

హోసూరు జోన్

భారీ భద్రత నడుమ మాజీ సీఎం జయలలిత నగల తరలింపు



నగలను తరలిస్తున్న వాహనం

హోసూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి భారీ బందోబస్తు నడుమ మాజీ సీఎం జయలలితకు చెందిన ఆభరణాలతో వెళ్తున్న వాహనాన్ని తమిళనాడు సరిహద్దు జూజూవాడికి చేరుకోగా కృష్ణగిరి పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితపై అక్రమ ఆస్తుల కేసు బెంగళూరులోని సీబీఐ ప్రత్యేక కోర్టులో జరిగింది. ఈ సందర్భంగా మాజీ సీఎం జయలలితకు చెందిన 27 కిలోల బంగారం, వెండి, వజ్రాభరణాలు, భూమికి సంబంధించిన పత్రాలను జప్తు చేశారు. వాటిని తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించేలా ప్రత్యేక కోర్టు ఆదేశించింది. దీని ప్రకారం భారీ పోలీసు బందోబస్తు నడుమ జయలలిత నగలను శనివారం తరలించారు. శనివారం సాయంత్రం కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని అత్తిబెలె వరకు కర్ణాటకకు చెందిన హులసూరు గేట్ పోలీసులు బందోబస్తు కల్పించారు. అనంతరం తమిళనాడు సరిహద్దులోని హోసూరు జూజూవాడి ప్రాంతం నుంచి కృష్ణగిరి సాయిధ బలగాలకు ఎస్ఐ నారాయణన్ నేతృత్వంలో ఆభరణాల వాహనాన్ని సురక్షితంగా తీసుకెళ్లారు. అనంతరం సదరు వాహన పర్యవేక్షణను కృష్ణగిరి సరిహద్దులో వేలూరు జిల్లా పోలీసులకు అప్పగించారు.

ఇంటెన్సివ్ ట్రైనింగ్‌పై అవగాహన

హోసూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): హోసూరులోని అదియమాన్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రధాని ఇంటెన్సివ్ ట్రైనింగ్ గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారత్నం అధ్యక్షత వహించారు. వైరముత్తు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. టీవీఎస్ సంస్థకు చెందిన హెచ్ఆర్ మహేశ్వరీ, టైటాన్ ఇండస్ట్రీస్‌కు చెందిన హెచ్ఆర్ ఖాదర్ బాషా శిక్షణ కార్యక్రమ దరఖాస్తుల గురించి కార్యదర్శి సురేశ్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్, విజయలక్ష్మి, సరళ, కృష్ణవేణి, ఎలక్ట్రానిక్ విభాగాధిపతి బాలాజి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీవీఎస్ సంస్థ ప్రతినిధులు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

హోసూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హోసూరు బేరికై పోలీసులు సినారంబట్టి ప్రాంతంలో ఆదివారం ఉదయం వాహన తనిఖీల వేళ ద్విచక్ర వాహనంలో వారిని సోదా చేయగా కర్ణాటక మద్యాన్ని గుర్తించారు. 6 బాక్సులలో 51 లీటర్ల కర్ణాటక మద్యం ఉందని గుర్తించారు. రామన్‌దొడ్డికి చెందిన జయరామన్ (26), మునిరాజు(37)లను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతుల సంక్షేమంపై దృష్టి సారించాలి



నాంచారయ్యను సన్మానిస్తున్న బ్యాంకు అధ్యక్షుడు బసవన్నగౌడ, డైరెక్టర్లు

సిరుగుప్ప, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమంపై దృష్టి సారించాలని డీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షులు బసవన్న గౌడ పిలుపునిచ్చారు. ఆదివారం సిరుగుప్ప పట్టణంలో వ్యవసాయ సహకార సంఘం నెంబర్-2 కార్యాలయం, వాణిజ్య షాపుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షులు బసవన్నగౌడ, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య, సంఘం అధ్యక్షులు నాంచారయ్య హాజరయ్యారు. వ్యవసాయ సహకార సంఘం ప్రధానంగా రైతుల సంక్షేమంపై దృష్టిసారించాలని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. డైరెక్టర్లు సుబ్బారావు, కోనేరు గోపాలకృష్ణ, శ్రీనివాస, కార్యదర్శి వెంకోబ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కరిబసప్ప, సీనియర్ న్యాయవాది మల్లికార్జునయ్య, వివిధ బ్యాంకుల కార్యదర్శులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పెనుకొండ రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని వ్య క్తి శనివారం రాత్రి రాజధాని రైలు కింద పడినట్లు ఆ రైలు లోకోపైలెట్ సమాచా రం అందించినట్లు తెలిపారు. హిందూపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పెనుకొండ ప్ర భుత్వ ఆసుపత్రికి తరలించారు. మృ తుడికి 35 సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. మృతదేహంపై పచ్చరంగు టీషర్ట్, నల్ల ప్యాంటు ఉన్నాయన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే హిందూపు రం రైల్వే పోలీస్ 9441238182, 9440 627641లకు సమాచారం అందించాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

జిడ్డు కృష్ణమూర్తి (వర్ధంతి)



దేశం మెచ్చిన తత్వవేత్తలలో జిడ్డు కృష్ణమూర్తి ఒకరు. 1895 మే 11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. 1929 నుంచి తుది శ్వాస వరకు ప్రపంచం నలుమూలలా పర్యటిస్తూ తాత్విక, ఆధ్యాత్మిక అంశాలపై అనేక ప్రసంగాలు చేశారు. మానసిక విప్లవం, మనోభావ విచారణ, ధ్యానం, మానవ సంబంధాలు, సమాజంలో మౌలిక మార్పు అనే ప్రధాన అంశాలపై ప్రజలను చైతన్య పరిచారు. ఆయన బోధించిన తత్వం ఏ నిర్ణీత తాత్విక చట్రంలో ఇమడదు. నవ మానవతా వాదిగా, ఎవరి అభిమానాలను ఆశించక, ఎవరి సహాయాలను ఆశించక, ఎవరి నిందలను లెక్కించక జీవన సంగ్రామాన్ని వాస్తవించి, గొప్ప జీవన శిల్పిగా నిలిచారు. సమస్త జీవరాశులపట్ల కారుణ్యాన్ని వ్యక్తం చేసేవారు. 1986 ఫిబ్రవరి 17న కన్నుమూశారు.

కే చంద్రశేఖర్‌రావు (పుట్టినరోజు)



కేసీఆర్‌గా చిరపరిచితులైన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 1954 ఫిబ్రవరి 17న మెదక్ జిల్లా చింతమడక గ్రామంలో జన్మించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమనేత, రాజకీయ నాయకుడు. సమైక్యాంధ్రప్రదేశ్ నుంచి వేరుపడిన తెలంగాణ రాష్ట్రానికి 2014లో తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. అలాగే 2018లోనూ రెండోసారి సీఎం అయ్యారు. అంతకు ముందు ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా వివిధ హోదాలలో వ్యవహరించారు. జాతీయ రాజకీయాల్లో రాణించే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని 2022లో భారత్ రాష్ట్ర సమితి పేరుగా మార్చుచేశారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



వేదికపై కైవార ధర్మాధికారి ఎంఆర్ జయరాం తదితరులు

మహదేవపుర, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా తెలుగుజాతి వైభవాన్ని ప్రపంచానికి చాటిన శ్రీకృష్ణదేవరాయల జయంతిని కేఆర్‌పుర ప్రభుత్వ పస్ట్‌గ్రేడ్ కళాశాల రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర బలిజయువశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమలో కైవార ధర్మాధికారి ఎంఆర్ జయరాం మాట్లాడుతూ బలిజ సామాజిక సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. బీసీ 2ఏ రిజర్వేషన్‌కోసం పోరాటం అనివార్యమైందన్నారు. ఉద్యోగ, రాజకీయాలలో ప్రాతినిధ్యంతోపాటు హక్కులు, సౌలభ్యాలకోసం ఐకమత్యంగా పోరాటం చేయాల్సి ఉందన్నారు. సామాజికంగా బలోపేతం, ఐకమత్యంగా ఉండడం ద్వారా సత్సంబంధాలు పెరిగి విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఇతరులకు చేతనైనా సహాయం అందించడం వంటివి మెరుగు అవుతాయన్నారు. ఇదే సందర్భంగా ఆవలహళ్ళి నుంచి కేఆర్ పుర వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సురేంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షులు కేటీ రాజ్‌కుమార్, ప్రిస్టేజ్ గ్రూప్ విద్యాసంస్థల అధ్యక్షుడు ఆంజినప్ప, ప్రముఖులు వినయ కనకనాల్, నాగభూషణ, సాయి పురుషోత్తమ్, ధనశేఖర తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పురందరదాస గేయాలు

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో 45వ వార్షిక సంగీతోత్సవ, త్యాగరాజ, పురందరదాస ఆరాధనోత్సవంలో భాగంగా గేయాలాపన సభికులను అలరించింది. సంజయ్‌నగర్ నాగిశెట్టిహళ్ళిలోని రమణమహర్షి హెరిటేజ్ సెంటర్‌లో ఆదివారం కార్యక్రమం జరిగింది. కళానికేతన్ వ్యవస్థాపక కార్యదర్శి వేణుగోపాల్, అధ్యక్షులు శ్రీధర్‌తోపాటు పలువురు సంగీత ప్రాధాన్యతను వివరించారు. విదూషి చింతలపల్లి జలజా ప్రసాద్, మంగళభాస్కర్, శ్రీనివాస్, సోమశేఖర్, చంద్రికా ప్రహ్లాద్, స్మితా దేవసింహ, జయశ్రీ, శ్రీలక్ష్మి, కమలాప్రాణేశ్, సరస్వతి రమేశ్ సహా పలువురు కీర్తనలు ఆలపించారు.



గేయాలను ఆలపిస్తున్న గాయకులు

పాలకవర్గాల ఎన్నిక



విజేతలను సత్కరిస్తున్న దృశ్యం

బాగేపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రాథమిక సహకార కృషి, గ్రామీణాభివృద్ధి బ్యాంకు పాలకవర్గం డైరెక్టర్‌ల స్థానాలకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. నారేమద్దేపల్లి, చాకవేలు స్థానాల ఫలితాలపై స్టే విధించారు. బిళ్ళూరు స్థానం డైరెక్టర్‌గా నంజుండప్పకు 10 ఓట్లు రాగా ప్రత్యర్థి సత్య నారాయణకు 4 ఓట్లు లభించాయని ఎన్నికల అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ మద్దతుదారుడు నంజుండప్ప విజయంపై కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పీఎల్‌డీ బ్యాంకు మాజీ డైరెక్టర్‌లు శ్రీరామరెడ్డి, జి గంగులప్ప, ప్రముఖులు కేకే వెంకటేశ్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా సతీశ్



సంఘం డైరెక్టర్లకు అభినందన

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళమాచనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం నూతన అధ్యక్షుడిగా జేడీఎస్ మద్దతుదారుడు ఆర్ సతీశ్, ఉపాధ్యక్షులుగా ఎంఎస్ కృష్ణప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల డెయిరీకి ఇంతవరకు అధ్యక్షుడిగా ఉన్న రామచంద్రచారి, ఉపాధ్యక్షుడు సవితా కేశవమూర్తిల రాజీనామాతో ఖాళీ అయిన స్థానాలకు ఆదివారం సంఘం కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్షస్థానానికి ఆర్ సతీశ్, ఉపాధ్యక్షస్థానానికి ఎంఎస్ కృష్ణప్పలు మాత్రమే ఏకగ్రీవమయ్యారు. సహకార శాఖ అభివృద్ధి ప్రాధికార మంజునాథ్ ఎన్నికల అధికారిగా, డెయిరీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం వినయ్ కుమార్ సహాయక ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను, డైరెక్టర్‌లకు పూలమాలవేసి అభినందించి, మిఠాయిలు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా జేడీఎస్ యువ నాయకుడు ఎంజీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ మళమాచనహళ్ళి గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం 13మంది డైరెక్టర్లు జేడీఎస్ మద్దతుదారులు గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు ఎంసీ జగదీశ్, పాల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు రామచంద్రాచారి, మాజీ ఉపాధ్యక్షురాలు సవితా కేశవమూర్తి, డైరెక్టర్ ఎంసీ అశోక్, ఎంఎన్ వెంకటేగౌడ, ఎం మనోహర్, బి ద్యావప్ప, తినికల్ శ్రీనివాస్, ప్రమీళమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవానికి సన్నాహక సభ



జ్యోతి వెలిగించి, సన్నాహక సభను ప్రారంభిస్తున్న ఆదినారాయణ తదితరులు

ముళబాగిలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాలూకాలోని కప్పల మడుగు గ్రామంలో మార్చి 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆదివారం సన్నాహక సభ జరిగింది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయ కుడు వీ ఆదినారాయణ మాట్లాడుతూ మార్చి 8న దీర్ఘ సుమంగళి భవలో భాగంగా మహిళలకు ఒడి బియ్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. పట్టణ శివారులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో సన్నాహక నిర్వహించారు. మహిళలకు పసుపు, కుంకుమ, చీర, గాజులు ఇచ్చి గౌరవించనున్నట్టు తెలిపారు. ఇదే సందర్భంగా పార్టీకోసం శ్రమిస్తున్న మహిళలను కార్యక్రమంలో పాల్గొనేలా పార్టీ మహిళా నాయకులు చొరవ చూపా లన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి విచ్చేసే మహిళలకు ఆసన వ్యవస్థ ఉంటుందన్నారు. వచ్చే గ్రామపంచాయతీ, తాలూకా పంచాయతీ, జిల్లా పంచాయతీ, నగరసభ ఎన్నికల్లో పోటీ చేసేలా మహిళా ప్రముఖులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కోలారు ఎమ్మెల్యే కొత్తూరు జి మంజునాథ్ సూచన మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఇదే సందర్భంగా అగర గ్రామ పంచాయతీకి చెందిన రవిచంద్ర కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆవణి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నీలకంఠేగౌడ, కేపీసీసీ సభ్యుడు జీ రామలింగారెడ్డి, టౌన్ బ్లాక్ అధ్యక్షుడు అమానుల్లా, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు గంగిరెడ్డి, మండికల్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ అంబులెన్స్‌లో
బెంగళూరుకు..

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం పాటియాలాలో రోడ్డు ప్రమాదానికి గురైన రాష్ట్ర చెరుకు రైతుసంఘం అధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్‌ను ఎయిర్ అంబులెన్స్ ద్వారా బెంగళూరుకు తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా కొనసాగుతున్న పోరాటంలో పాల్గొనేందుకు కురుబూరు శాంతకుమార్ వెళ్లారు. ఈనెల 14న శుక్రవారం కారులో ప్రయాణిస్తుండగా కురుబూరు శాంతకుమార్ ప్రమా దానికి గురయ్యారు. పాటియాలాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన చికిత్సలు పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సీఎం సిద్దరామయ్య స్పందించారు. ఈమేరకు శనివారం రాత్రి ఎయిర్‌అంబులెన్స్ ద్వారా బెంగళూరుకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఆదివారం ఉదయం చండీఘడ్ నుంచి ఎయిర్‌అంబులెన్స్ ద్వారా తీసుకొచ్చారు. హెచ్‌ఏఎల్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలకు తరలించారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, సోమణ్ణతోపాటు డీసీఎం డీకే శివకుమార్, మంత్రి హెచ్‌కే పాటిల్ తదితరుల చొరవతోనే వేగవంతంగా శాంతకుమార్‌ను బెంగళూరుకు తీసుకురావడం సాధ్యమైందని కుటుంబీకులు తెలిపారు.

వేదికైనా మార్చండి..
డిసెంబరులోనైనా జరపండి

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏరో ఇండియా ప్రదర్శనలను ఇతర ప్రాంతాలకు తరలించడం లేదా ఫిబ్రవరిలో కాకుండా డిసెంబరులోనే అమలు చేయాలని పలు ప్రభుత్వ ఏజెన్సీలు అభిప్రాయపడుతున్నాయి. కేంద్ర హోం శాఖ, జియాలజీ మంత్రిత్వశాఖ పరిధిలోని విపత్తు నిర్వహణా అధికారులు, రాష్ట్ర రెవెన్యూ, ట్రాఫిక్, ఆరోగ్యశాఖ అధికారులు ఇటీవల ఐదు రోజులపాటు జరిగిన ఏరో ఇండియా 2025 ప్రదర్శనలను పరిశీలించారు. ప్రధానంగా యలహంక ఎయిర్‌బేస్‌లో విమాన ప్రదర్శనలు జరిగే ప్రాంతంలో తీవ్రమైన ఎండ ప్రభావంతో సందర్శకులు ఇబ్బంది పడ్డారని, రోడ్డుపై గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో సందర్శనకు వచ్చినవారితోపాటు జాతీయ రహదారిపై ప్రయాణించేవారు, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ద్వారా రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడినట్టు పలు ప్రభుత్వ ఏజెన్సీలు సలహా ఇచ్చినట్టు తెలుస్తోంది. వైమానిక ప్రదర్శన సందర్శకులకు కేటాయించిన ప్రదేశం, ఫుడ్‌కోర్టుతోపాటు ప్రతి చోటునుంచి మరోచోటుకు వెళ్లాలంటే ఎండవేడిమికి ప్రజలు విలవిలలాడారాని అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. బెంగళూరు నగరం దినదినాభివృద్ధి చెందిన ప్రాంతం కావడంతో ఎయిర్‌షో రిహార్సల్స్, ఐదు రోజుల ప్రదర్శనల కార ణంగా సుమారు 15రోజులపాటు లక్షలాదిమంది సమస్యలు ఎదుర్కొనారనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఫిబ్రవరికి బదులుగా డిసెంబరులోనే ఎయిర్‌షో నిర్వహిస్తే సముచితంగా ఉంటుందని ఆకాశంలో కూడా ఎటువంటి పరిణామాలు ఉండవని అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. అయితే 2027లో జరిగే ప్రదర్శనలకు అప్పుడే ఇటువంటి అభిప్రాయాలు వ్యక్తం కావడం గమనార్హం.

ఆభరణాల ఎంపికలో
జాగ్రత్తలు అవసరం

బెంగళూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): బంగారం, వెండి, వజ్రాల ధరలు భారీగా పెరిగాయని ఆభరణాల ఎంపికలో జాగ్రత్తలు అవసరమని ప్రముఖ శాండల్‌వుడ్ నటి రచితారామ్ అభిప్రాయపడ్డారు. ఆదివారం జయనగర్‌లో లాడియా వజ్రాభరణాల షోరూంను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే సీకే రామమూర్తి పాల్గొన్నారు. డైమండ్స్ కొను గోలులో నాణ్యత, నమ్మకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లాడియా డైరె క్టర్ అఖిల్ వెమలూరి మాట్లాడుతూ ల్యాబ్రోన్ వజ్రాల రంగంలో అపార అనుభవం ఉందని, జయనగర్‌లో మూడోశాఖను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రకృతిలో లభించే వజ్రాలు ప్రత్యేకమన్నారు.

అబ్బురం.. బాలల సంబరం

అలరించిన నృత్యం





సాంస్కృతిక కార్యక్రమాల్లోని దృశ్యాలు

అట్టహాసంగా ముగిసిన అనంత బాలోత్సవం

మూడు రోజులు... ఏడు వేల మంది విద్యార్థులు



నృత్యం.. భళా..

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'అనంత బాలోత్సవ' సంబరం ఆదివారం ముగిసింది. ఉత్సవాల్లో భాగంగా మూడురోజులపాటు అనంతపురంలోని లలితకళా పరిషత్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ ప్రాంగణాలు పిల్లల ఆటపాటలతో సందడిగా మారాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను చాటుకునేందుకు పోటీపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆరాటపడ్డారు. నిత్యం చదువుల్లో మునిగితేలే విద్యార్థులకు ఈ మూడురోజుల ఆటవిడుపు నూతనోత్తేజం నింపింది. వారి ప్రదర్శనలు చూసి వీక్షకులు ఎంతో ముచ్చటపడ్డారు. చక్కటి వాతావరణంలో బాలోత్సవాన్ని సజావుగా నిర్వహించడం కనుల పండువగా నిలిచింది.

సృజనను వెలికితీసేందుకు దోహదపడతాయి
- వెంకటరమణ నాయక్, ఆర్‌ఐఓ

పిల్లల్లో దాగున్న ప్రతిభతోపాటు సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. బాలోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడురోజులపాటు కార్యక్రమంలో ఎల్‌కేపీ కార్యదర్శి పద్మజ, బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా, కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండయ్య, మానవత రక్తదాతల సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, బాలోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమిద్యాలలో భారీ చోరీ

ఉరవకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమిద్యాల గ్రామంలో దర్జీ నారాయణరావు అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. ఇంట్లో 20 తులాల బంగారు, రూ.1.50లక్షల నగదును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. నారాయణరావు అతని భార్య సరస్వతితో కలిసి 20 రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి బెంగళూరులో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు, నగదును దోచుకెళ్లారు. బాధితుడు ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడం, బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంచి స్నేహితులతో జీవితంలో మార్పు

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జీవితం సజావుగా సాగేందుకు మంచి స్నేహితులు లభించడంలో ఎటువంటి సందేహం లేదని మారతహళ్ళి ఉప విభాగం ఏసీపీ డాక్టర్ ప్రియదర్శిని సైనికోప్ అభిప్రాయపడ్డారు. సర్జాపుర రోడ్డులోని సూర్యోదయ బాలురకేంద్రం మైదానం ఆవరణలో ట్రీడా సంస్థ ఆధ్వర్యంలో క్షేమ, డ్రగ్స్ రహిత కర్ణాటక కోసం 6 కిలోమీటర్ల పరుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మానవుడి ఉత్తమ ఆరోగ్య జీవనానికి మంచి అలవాట్లు చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ కనీసం ఒక గంట పాటు శరీరానికి వ్యాయామం, యోగా, నడక వంటివి అలవరచుకోవాలన్నారు. దురలవాట్లతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. తల్లిదండ్రులు, కుటుంబీకుల ఆదరాభిమానాలు పొందడమే కాక మంచి స్నేహితులు కూడా అవసరమన్నారు. ట్రీడా సంస్థ ముఖ్యులు డాక్టర్ లింగరాజు మాట్లాడుతూ యువతలో చైతన్యం కల్పించే లక్ష్యంగా మూడేళ్లుగా నిరంతరంగా మారథాన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హాల నాయకనహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సవితా బాబురెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన జీవనాన్ని అలవరుచుకోవాలని అభిప్రాయపడ్డారు. పరుగులో 800మందికిపైగా పాల్గొన్నారు. పోటీలలో ప్రథమ బహుమతిని చందాపుర నివాసి నంజుండప్ప, రెండో బహుమతిని స్వామి వివేకానంద కళాశాల విద్యార్థి వెంకటేశ్, మూడో బహుమతిని ఎన్ గణేశ్, నాల్గో బహుమతిని హుబ్బళ్ళికి చెందిన ఎస్‌డీ షాహీన్ పొందారు. సీఐ రమేశ్‌కుమార్, సమాజసేవకుడు బాబురెడ్డి, ట్రీడా సంస్థ పదాధికారులు డాక్టర్ టీను జార్జ్, ఆశ్మిత తదితరులు పాల్గొన్నారు.



విజేతకు అభినందన

యల్లమ్మదేవి రథోత్సవంలో ఎమ్మెల్యే



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేణుకా యల్లమ్మ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటైన రథోత్సవానికి ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణభారతదేశంలో మాతృదేవి రూపంలో సాక్షాత్తు పార్వతిదేవి రూపమైన ఉన్న రేణుకా యల్లమ్మదేవికి లోకకల్యాణార్థం రథోత్సవాన్ని కులమతాలకు అతీతంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కారహళ్ళి సమీపాన సర్వే 15లో భవన నిర్మాణానికి 30 గుంటలను, హొల్లళ్ళి సమీపాన సర్వే 103లో దేవస్థానానికి 10 ఎకరాల భూమిని ఇచ్చేలా ప్రభుత్వానికి ప్రస్తావించామన్నారు. మాజీ ఎమ్మెల్యే బీపీ వెంకట మునియప్ప మాట్లాడుతూ సనాతన ధర్మంలో ఎన్నో పద్ధతులు ఉన్నాయన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే బీపీ వెంకటమునియప్ప, మాజీ ఎంపీ మునిస్వామి, జడ్పీ మాజీ సభ్యుడు బీవీ మహేశ్, హుణసనహళ్ళి శ్రీనివాస్, కారహళ్ళి ప్రతాప్, ట్రస్టు అధ్యక్షుడు నారాయణస్వామి, పురసభ సభ్యులు శారదా వివేకానంద, అరుణ్, కవి లక్ష్మయ్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక చికిత్సతో సంతానం

బెంగళూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆధునిక చికిత్సలతో సంతాన సౌభాగ్యం సాధ్యమని మైసూరులోని సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామిజీ అభిప్రాయపడ్డారు. ఆదివారం బన్నేరుఘట్ట రోడ్డులో ఖుషి ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించారు. గైనకాలజిస్ట్ రష్మి యోగేశ్ తోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ చికిత్సలు ఆధునాతనం అయ్యాయని అందుకే అన్ని సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు అవసరమైన వైద్య పరీక్షలు జరిపించుకుని ముందుగానే చికిత్సల ద్వారా ఆరోగ్యంతోపాటు సంతానాన్ని పొందవచ్చునన్నారు. రష్మి యోగేశ్ మాట్లాడుతూ 2013లో కేంద్రాన్ని ప్రారంభించామని ప్రస్తుతం ఈ శాఖ ద్వారా మరింత మందికి ప్రయోజనం చేకూరుతుందని ఆకాంక్షించారు.

వేతనాల కోసం కార్మికుల సమ్మెబాట

- నేటి అర్ధరాత్రి నుంచి శ్రీరామిరెడ్డి తాగునీరు బంద్
- ఉమ్మడి జిల్లాలో 850 గ్రామాలకు ఇబ్బందులే..!



కార్మికులతో మాట్లాడుతున్న ఓబులు

కూడేరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆరునెలల వేతనాలు, 30 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పట్టారు. మండలంలోని పీఏబీఆర్ డ్యాంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రాజెక్టు వద్ద ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ తాగునీటి ప్రాజెక్టులో దాదాపు 600 మంది కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. దీంతో కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి పంపులు బంద్ చేసి సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో కళ్యాణదుర్గం, రాయదుర్గం, బెళుగుప్ప, పరిగి, హిందూపురం, మడకశిర డివిజన్‌లలోని 850 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. వేతనాలు చెల్లించకపోతే కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని, ఈ విషయంపై పలుమార్లు కాంట్రాక్టర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. అందుకే సమ్మెకు సిద్ధమైనట్లు తెలిపారు. అనంతరం కార్మికుల డిమాండ్లతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయనతోపాటు కార్మిక సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 375 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.